# లేచి పోవాలనుకొంటే

'తలుపు నెట్టుకొని విసురుగా, ఇంట్లోకి ప్రవేశించి అన్నాను. నేను వెడుతున్నాను. ఇక మనకు కుదరదులే' అని.

'నేనేం జేశాను? మీకంత కోపం రావటానికి! ఏదో సంసారంలో, భార్యాభర్తలన్న తరువాత పోట్లాటలంటూ వస్తే సర్దుకు పోతారుగాని తెంచుకు పారిపోతారా?'

'.......................'

'మాట్లాడరేం ఎక్కడైనా ఉందండీ ఇల్లాంటి వైపరీత్యం? సంసారం గుట్టు, రోగం రట్టు అన్నారు. మీరు నన్నిల్లా అల్లరి పెట్టడం ధర్మం కాదు. అయినా ఇంతకూ నా తప్పేముంది?'

'మళ్ళీ యాకరు పెట్టుమంటావా మొదటి నుంచీ?'

"వద్దు, బాబూవద్దు. మళ్ళా మొదటికి తీసుకురాకండి."

"అయితే నీవు మాట్లాడక......సుశీ, అట్లా రోడ్డు మీద కెళ్ళి ఒక బండి తీసికొనిరా?"

"ఉండవే, అమ్మాయ్, అయితే ఎక్కడికీ ప్రయాణం ఒక్కమాట చెప్పండి?"

"ఎక్కడికైతే నీకెందుకు? ఎక్కడకో వెళ్ళిపోతాను."

"బండితేనా, నాన్నా."

"ఇంకా, ఇక్కడే ఉన్నావుటే?"

"అయితే వెళ్ళిపోవటం నిశ్చయము అన్నమాటే!"

"నిశ్చయమా అని మెల్లగా అడుగుతున్నావేమిటి? వెళ్ళిపోతుంటే," అన్నాను దుఃఖాన్ని దిగి మ్రింగుకొని."

"మళ్ళీ ఎప్పుడు వస్తారు?"

"నీకేం వేళాకోళంగా ఉందా ఏమిటి? ఇదే ఆఖరుసారి ఈ ఇంట్లో........."

అనేసరికి అప్రయత్నంగా నా గొంతుకులోకి సన్నని వణుకు వచ్చింది. ఆ రోజున నేనన్న మాటలు హాస్యానికి కాదు. అట్లా ఒకనాటకం ఆడానని అనుకోలేదు.

నిజం. దైవ ముఖాన చెబుతున్నాను. నిజంగా సంసారం త్యజించి పోదామనే ప్రయత్నం. సౌఖ్యం లేకపోయిన తరువాత జీవించటంవల్ల ప్రయోజనం ఏముంది? అల్లా అని ప్రాణత్యాగం చేసుకోలేము. ఏదో ఇదివరలో సంపాదించి, పెద్దలు ఇచ్చిపోయిన బాపతు ఆస్తివలన జీవనం గడుస్తుంది. మా సంసారానికి నేనున్నా లేకపోయినా.

కాంతం సంగతా అయి పోయినవి సౌఖ్యదినాలు.

ఇకముందు నా జీవితానికి అంతా అమావాస్యే గాని వెన్నెల దినాలు రాబోవు.

పిల్లల సంగతో, భగవంతుడే ఉన్నాడు! ఎందుకు జీవిస్తున్నట్లు నేను! సంపాదించి మేడలూ మిద్దెలూ కట్టటం లేదు. సాహెబు సంపాదన బూబమ్మ కుట్టు పోగులకు సరి, అన్నట్లుంది నా సంపాదన. నే జేసే లోకోప కారమా, సున్నాకు సున్నా హళ్ళీకి హళ్ళీ. ఇంకెందుకు ఈ గంపెడు సంసారాన్ని ఈదటం? నేను లేకపోయినా గడచిపోతుంది. అంచేత దుఃఖ జనకమై, కేవలము మిథ్యయైన ఈ సంసారాన్ని వదిలేసి ఇతర దేశాలలో అజ్ఞాతంగా తిరుగుతూ భక్తిని అలవరించుకొని, ముక్తిని సాధిద్దామని ఆ రోజు నిజంగా అనుకొన్నాను. నిజమంటే నిజం.

"అయితే? ఆవిడకు మాత్రం నా నిజోద్దేశం చెప్పినా నమ్మలేదు."

"నిజంగా వెడతారా."

"ఆ...................."

"సరే! వెళ్ళేవాళ్ళను పట్టుకుంటే మట్టుకు ఆగుతారా? వక్కమాట ఇలా చూడండి. పసిది కూడా వస్తుందట! ఎట్లా దూకుతుందో చూడండి! ఒక్కమాటు తీసికోండి!"

"ఒక్కసారి కాదుగదా. అరసారైనా తీసుకోను. తెంపుకుపోతున్న వాడిని ఈ ప్రేమ బంధాలతో ఎందుకు కట్టేస్తా? పొయ్యేవాడ్ని పోనీ, అడ్డురాకు."

"......................"

"నవ్వుతావూ! నీకేం తెలుస్తుంది నా కడుపులో పుట్టిన ఆందోళన, నాకు వద్దు ఈ సంసారం.......నరకం........."

సంఘం, శరణం గచ్ఛామి

ధర్మం శరణం గచ్ఛామి

బుద్ధం శరణం గచ్ఛామి

"అబ్బ, ఎంత కఠినమండీ, సాక్షాత్తు బుద్ధదేవుళ్లైపోతున్నారే! బుద్ధదేవుడు కూడా మహానిష్క్రమణానికి ముందు భార్యా పుత్రులవంక ఒక్కసారి ప్రేమద్రుక్కులు ప్రసాదించాడు. తెలియదండీ!"

అయితే సరే, ఒక్కసారి ఇయ్యి. ఒకసారే. ఒక గాఢాలింగనం.... ఒక్క చుంబనం......సరి తీసుకో.......నన్ను బంధించక.......బుద్ధం శరణం గచ్ఛామి........"

"రావటం లేదు. మీదగ్గర నుంచి."

"తీసుకో......ఇంద.....ఊ."

"రానంటుంటే......దాన్ని కూడా తీసికెళ్ళండి. జాగ్రత్తగా పెంచండి. శిష్యురాలౌతుంది!"

"మరేం అక్కర్లేదు.......ఇంద"

"నిజంగా వెడతారా?"

"వెడుతుంటేనే...... పిల్లలను జాగ్రత్తగా పోషించుకో. ఆ వున్నది చాలు, లేదనకుండా గడవటానికి, అని గిరుక్కున తిరిగాను. ఇటుచూద్దునుగదా పిల్లలంతా ఎక్కడికో ప్రయాణసన్నాహంలో ఉన్నారు." కాంతంతో అన్నాను.

"వీళ్ళను నామీదికి తోలేవేమిటి? వీళ్ళనుతీసుకుపో. నేను వెళ్ళిపోతాను. ఈ చివరరోజు కూడా నీవు నాకు అనుకూలవతివి కావూ?" అన్నాను కంపిత కంఠంతో.

"వారు నామాట వినరు. మీరేచూచుకోండి ఆ విషయం." అంటూ కాంతం చెరచెర నడచిపోయింది.

"ఒరేయి ఏమిటి బూడ్సులు తొడుగుతున్నావెందుకు?"

"నేనూ, వస్తానాన్నా."

"అదేమిటే అమ్మాయి?"

"......................."

"నువ్వెక్కడికే సుసీ?"

"...................."

"నువ్వెందుకురా, అట్లా చిందులేస్తావు?"

"నేనూ, వస్తాను నాన్నా."

"నేనూ..............."

"నేనూ.........నాన్నా."

"నేనో................"

"ఉ...ఉ...ఉ...ఉ..."

"ఓరి వెధవల్లారా. ఎక్కడికి వస్తారు. ఎక్కడికిరా వస్తారూ అంటా? అమ్మ ఉప్మా చేసింది. పొండి?"

"ఉహు...ఉహు...ఉహు"

"ఎక్కడికి వస్తావురా?"

"నీవు ఎక్కడికి వెళుతున్నావు?"

"నేను వెళ్ళిపోతున్నాను"

"ఉ...ఉ..."

"నేను...వస్తా...నాన్నా..."

"ఓరి వెధవా నేను సంసారం వదిలేస్తున్నా."

"నేను వదిలేస్తా నాన్నా..."

"ఓరి గాడిదా, సన్యాసం పుచ్చుకొంటానికి వెడుతున్నానురా." అన్నాను విసుగ్గా..."

"నేనూ, పుచ్చుకొంటా నాన్నా" అన్నాడు మా అయిదేండ్ల చిన్న వెధవ.

"నేనో నాన్నా అని బిక్కముఖం వేసింది సుశీ"

ఈ చిన్న వెధవలంతా నాతోపాటు సన్యాసం పుచ్చుకుంటామంటూ బయలుదేరారు. బుద్ధదేవుడికి ఒక్క కొడుకు కాబట్టి తెంచుకు పారిపోయినాడు. అదీ నిద్రపోతున్నప్పుడు! అదీ అర్ధరాత్రి! అసుర సంధ్యవేళ అరడజను పిల్లలను వదలించుకొని వెళ్ళవలసి వచ్చినట్లయితే తెలిసేది ఈ సంసారానికి మానవుడు ఎట్లా కట్టబడి ఉన్నాడో!

కుర్చీలో కూలబడ్డాను కదలకుండా మెదలకుండా, పిల్లలు నా ముఖంవంక చూశారు. నేను నవ్వకుండా, గంభీరంగా ఉండటం చూచి పెద్దపిల్లలు ఒకరొక్కరే జారారు.

చిన్నవాళ్ళు ఏడుస్తూ, తల్లిదగ్గరకు పోయినారు. కళ్ళు మూసికొన్నాను.

చెన్నుడు కోటవెలపల గుర్రాన్ని తయారుచేసి ఉంచి సిద్ధంగా ఉన్నట్లూ, బుద్ధదేవుడు గంభీర వదనంతో, భార్యా పుత్రాదులను, ధనసంపదలనూ, సర్వమూ త్యజించి, ఆతురలో వస్తూ ఉన్నట్లు, నాకొక దృశ్యం కనపడ్డది. బుద్ధదేవుణ్ని ప్రార్థనచే, నేనూ, ఒక్కమారు, ఇంటిని నాల్గుదిక్కులా చూచి, నిట్టూర్పు విడిచి, గుమ్మందాటి బైటపడ్డాను ఈ విశాలమైన ప్రపంచంలోకి.

వీధి మలుపు తిరిగాను బుద్ధదేవుణ్ని ధ్యానిస్తూ వెనకాలనుంచి కెవ్వున కేకేసి పరుగెత్తికొని వస్తున్నారు రాధా విజయలు. పెద్దవాడు లాగూ, చొక్కా కోటూ వేసికొని, బూడ్సులు తొడొక్కొని, చెమ్కిటోపి పెట్టుకొని నాకు నాల్గు గజాల దూరంలో ముందు నడుస్తున్నాడు,-నేను రావటాన్ని గమనిస్తూ, మాటిమాటికి వెనక్కు తిరిగిచూస్తున్నూ. పెద్దపిల్లలిద్దరూ కొత్తపరికిణీలు కట్టుకొని కొత్తచొక్కాలు తొడుక్కున్నారు. వాళ్ళమ్మ నడిగి తీసుకొన్నారు కాబోలు బంగారు గొలుసులు మెడలో మెరుస్తున్నవి. దూరంగా రోడ్డు మీద నుంచిని నేను పోవలసిన దారినే ముందుగా గబగబ నడుస్తున్నారు. పంచరత్నాలను నేను మరోసారి స్మరించుకొన్నాను.

వీళ్ళంజూచి నేను తెల్లబోయినాను. అమ్మాయిలనూ పిల్చి 'వెళ్ళండే యింట్లోకి' అన్నాను. వాళ్ళు 'మేము వేరే పనిమీద వెడుతున్నాము ఇంకో చోటికి.

నీతో రావటం లేదు' అని కిలాకిలా నవ్వుతూ దూరంగా నుంచున్నారు.

'నువ్వెక్కడికిరా పోరా' అన్నాను దగ్గరనున్న వెధవతో.

'నేను వస్తాను నాన్నా' అని మళ్ళీ అన్నాడు వాడు బిక్కముఖంవేసి.

'నేను ఎక్కడికి వెడుతున్నా ననుకొంటున్నావురా' అన్నాను.

'అమ్మ చెప్పిందిలేనాన్నా. అక్కయ్యలు రావటం లేదేం? అదుగో వాళ్ళునీకంటె ముందే అక్కడుంటారు.'

'ఎక్కడుంటారురా?'

'అక్కడే!...'

'ఎక్కడరా! ఏమని చెప్పింది అమ్మ.'

'......'

'నేను వస్తాను నాన్నా, మొన్న కూడా రాలేదూ'.

'ఎక్కడికి వెడుతున్నా ననుకుంటున్నావు చెప్పవే?'

'అమ్మ చెప్పిందిలే నాన్నా నీవు సినిమాకు వెడుతున్నావని'

'ఆ...ఆ...'

తెల్లబోయినాను పిల్లలిద్దరూ కాళ్ళకు చుట్టేసుకొని ఏడుస్తున్నారు. ఆ వీధిలోని ఆడవాళ్ళు కిటికీలోనుంచి చూస్తున్నారు. అసహ్యమనిపించింది. పసిదాన్ని, చిన్నవాడ్ని, రెండు చేతుల్లో యెత్తుకొని మళ్ళీ గుమ్మంలోకి వచ్చేను. పెద్ద వెధవ ఇష్టంలేక మెల్లగా అడుగులో అడుగు వేస్తున్నాడు నా వెనకాల. గుమ్మం దగ్గరకు వెళ్ళి తలుపు కొట్టాను.

'ఎవరది? చెయ్యి ఊరికేలేదు. వెళ్ళండి.'

తలుపు, తలుపూ'

'...............'

తలుపూ, అయ్యో తలుపు తియ్యవే!'

'ఎవరా, తలుపూ'

'నేనే...'

'అంటే...'

'అబ్బ...నేనే'

'ఎందుకూ?'

'తీయి, చెబుతా?'

'ఏమిటి చెప్పేది? సంసారంపైన విరక్తి పుట్టిపోయిన వాళ్ళకు అప్పుడే ఇదేం వికారం?'

'కాదులే, చెబుతా, తలుపు తీయి'

'కాదేమిటి? చెప్పేదేమిటి? మళ్ళా ఎందుకొచ్చారు' ఈ కూపంలోకి; వెళ్ళండి, వెళ్ళండి.'

'ఒక్కమాట'

"మాటా, లేదూ, గీటా, లేదూ, వెళ్ళండి."

"మాటా, మాటంటుంటే."

"ఇంకేం మాటలు లెద్దురూ?"

"అబ్బ చాల్లే! తలుపు తీయి, చేతులు పీకుతున్నాయి" అన్నాను.

మా అబ్బాయి "వద్దు నాన్నా, వెడదాం రానాన్నా అమ్మ తీయకపోతే ఏం? భయమా?" అన్నాడు.

"ఇంకేం, వెళ్ళండి, కొడుకు చెబుతున్నాడుగా సలహా" అంటూ తలుపు తీసింది కాంతం.

"ఎందుకూ, మళ్ళీ వచ్చారు?" అన్నది అణచిపెట్టుకొన్న నవ్వు ముఖం అంతా కలయబారింది.

"మరి వీళ్ళంతా?"

"నన్నేమి చేయమంటారు?"

"నువ్వు చేసిందేకాదూ, ఇదంతా?"

"ఈ మాత్రం జయించలేని వాళ్ళేనా, ప్రపంచాన్ని జయించటానికై బయలుదేరారు?" అన్నది ఈసడింపుతో దాన్ని అందుకొంటూ.

"నిజమేలే! ఇకలే అడ్డం......అన్నాను విసుగ్గా."

"ఉహూ....."

"అదేమిటి అల్లాగ నుంచుని లేవవు... పేరు జెప్పిస్తావా ఏమిటి."

"అటువంటిదే..."

"ఏమిటది?"

"ఒప్పుకోండి, ఓడిపోయినానని."

"సరే, ఓడిపోయినాను. ఇకలే! వీధిలో ఆడవాళ్ళందరూ కిటికీలలోనుంచి చూస్తున్నారు."

"లేకాదు, హ్యాండ్స్ అప్, (Hands up) నెపోలియన్ ఓడిపోయి ఆంగ్లేయుల ఎర్ర పతాకానికి సలాం చేతులెత్తలా! అట్లా!"

"చిత్తం", అని సలాం చేశాను. గాలికి కాంతం పమిట విప్పారి టపటప కొట్టుకొన్నది.

.................

"ఏమిటది?"

"ఏం లేదు, పక్షులు గూండ్లకు చేరుతూ కిచకిచలాడుతున్నాయి."

"కాదు, కాంతం, ఎవరో నవ్వుతున్నారు."

"కాదు రండి."

దభీలుమని తలుపు వేసింది కాంతం.